## ఉత్తమ నటి

ఆంధ్రుల అభిమాన నటి... ఉత్తమ నటి ... కుమారి ప్రియకు ఆ రోజు సన్మానం...ఆకాశమంత పందిరి రంగురంగుల దీప తోరణాలతో అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది అభిమానసంఘాల సభ్యులు దండలతో, ప్రశంసా పత్రాలతో వచ్చారు. మంత్రులు, రాజకీయ నాయకులు, అధికారులు, అనధికారులు, పెద్దలు, విద్యార్థులు, విద్యార్థినులు అందరూ వచ్చారు. మంగళ వాయిద్యాల మధ్య పట్టు వస్త్రాలతో ప్రియను సన్మానించి ఆమె నటనను ప్రశంసిస్తూ కావ్యాలు చదివేరు.

ఉత్తమ నటి అవార్డు పొందిన ఆమెను, ఆ చిత్రంలోని ఆమె నటనను వక్తలు పొగుడుతూ బిరుదు లిచ్చారు.

సన్మానం అయింతరువాత ప్రియ సెక్రటరీని పిలిచి ఏదో చెప్పి పర్సులోంచి కొన్ని వందల రూపాయల నోట్లను ఇచ్చింది.

తెల్లబోయిన సెక్రటరీ మరి మాట్లాడకుండా బయటకు వెళ్ళాడు.

**　　**　　**

కుమారి ప్రియ భవంతిలో, విశాలమైన హాలులో ఆమె శిల్పి చెక్కిన శిల్పంలా నిలబడి వుంది. ఎదురుగా ఆమెను తీర్చిదిద్దిన కళాకారులు... ప్రియ అందరికీ షీల్డులు ఇచ్చి "మీరు ఎంతో కృషి చేశారు. కృషి మీది, ఫలితం నాది... ఉత్తమ నటిని... కాదు కదిలే బొమ్మను- కీ బొమ్మను- మీకు సన్మానం చేసి కొంతయినా ఋణం తీర్చుకుంటే నటిగా నాకు తృప్తి. ఉత్తమ కళాకారులుగా మీకు ప్రోత్సాహం. మీ ఉత్తమ కళ, కీ బొమ్మలాంటి నా నటన కలిస్తేనే ఉత్తమ నటి... బేడ్‌లక్... క్రెడిట్ నాకే" అని అందరినీ సన్మానించింది.

ప్రియచే సన్మానించబడిన వాళ్ళెవరో తెలుసా...

తెలుగు భాష రాని ప్రియకు మాటలు చెప్పిన మంగళ.

నవ్వుకు డూప్‌గా అందంగా, గట్టిగా నవ్విన రవళి.

ఎత్తుమించి క్రిందకు పడి దెబ్బలు తగిలించుకున్న మనోహరి.

కెమెరా వెనుక నృత్యం చేసిన రంజని.

విషాద గీతంలో గాయనికి తోడుగా ఏడ్చిన లలిత.

చీకటి సన్నివేశంలో బ్రేక్ డాన్స్ వేసిన లావణ్య.

మంగళ - రవళి - మనోహరి - రంజని - లలిత - లావణ్య:: ప్రియ, ఉత్తమనటి.

**- కంచుమర్తి వెంకటేశ్వరరావు**

## మొదటి రాత్రి

**- యర్నాగు శ్రీనివాసులు**

రామారావు, సుందరమ్మల ఏకైక సంతానం సుబ్బారావ్. సుందరమ్మ పేరుకు తగ్గట్లుగా సుందరంగా వుంటుంది. సుబ్బారావుకు సుందరమ్మ అందం, రామారావ్ తెలివితేటలు అబ్బాయి. సుబ్బారావు డిగ్రీ పూర్తిచేశాడు. సెక్రటేరియట్‌లో చిన్న ఉద్యోగం కూడా సంపాదించాడు.

ఇక సుబ్బారావుకు పెళ్ళి చేయాలని తల్లిదండ్రులు నిశ్చయించుకున్నారు. ఒక అందమైన అమ్మాయితో పెళ్ళి నిశ్చయం చేశారు. అమ్మాయి పేరు శాంత కుమారి. శాంతం ఏ కోశానా లేదు. కాని ఆ విషయం పెళ్ళిమాపులవాడు చెప్పలేదు. అలాంటివి చెప్పరు కదా!

సుబ్బారావ్ పెళ్ళి గురించి, ముఖ్యంగా పెళ్ళి తరువాత జరగబోయే శోభనం గురించి ఆలోచించ సాగాడు. ఫ్రెండ్స్ చెప్పిన విషయాలు, తను పుస్తకాలలో చదివిన సన్నివేశాలు, సినిమాల్లో చూసినవి అన్నీ మనసులో పదిలపరచుకొన్నాడు.

ఒక శుభముహూర్తాన సుబ్బారావ్ పెళ్ళి జరిగింది. శోభనం ఏర్పాటు చేశారు. ముందుగా సుబ్బారావ్‌ని శోభనం గదిలోకి పంపారు. సుబ్బారావు ఆనందం పట్టలేక గాల్లో తేలిపోతున్నాడు. శోభనం గురించి ఎన్నో కలలు కన్నాడు. ఇన్నాళ్ళకు ఆ కలలు నిజం కాబోతున్నాయి.

శాంతకుమారి పాలగ్లాసు పట్టుకుని మెల్లగా గదిలోకి అడుగు పెట్టింది. ఆమెను ఆపాద మస్తకం పరీక్షించాడు సుబ్బారావు. మెల్లగా దగ్గరికి వచ్చి పాలగ్లాసు ప్రక్కన పెట్టి, సిగ్గుతో తలదించుకున్న శాంత ముఖారవిందాన్ని పైకెత్తి పెదవులను సున్నితంగా ముద్దు పెట్టుకుని, కౌగిలించుకున్నాడు. శాంత కూడా కౌగిలించుకుంది.

ఆ సమయంలో సుబ్బారావు జేబులోని కాగితం రెపరెప లాడింది. ఏమిటబ్బా! అని బయటికి తీశాడు.

"ఏమిటండీ అది" అని శాంత కాగితం తీసుకుని చదివింది. అది సుబ్బారావుని సంబోధిస్తూ వ్రాసిన ప్రేమలేఖ. క్రింద నీ ప్రియురాలు సరోజ అని వుంది.

శాంతకుమారి కోపంగా కాగితాన్ని సుబ్బారావు వైపు విసిరి, దిండు, దుప్పటి తీసుకుని క్రింద పరచుకుని పడుకుంది. సుబ్బారావు బ్రతిమాలినా చూడలేదు అతని వైపు. ఆ సమయంలో శాంత కుమారి, కోపకుమారిగా మారిపోయింది.

సుబ్బారావు ఎన్నో కలలు కన్న 'ఫస్ట్ నైట్' అలా వృధా అయిపోయింది. ఆ ప్రేమలేఖను సుబ్బారావు ఆకతాయి ఫ్రెండ్స్ అతనికి తెలియకుండా అతని జేబులో పెట్టారు.

